క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న హరితహారం చెట్లు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్ల పల్లిలో బీటీరోడ్డుకు ఇరువైపుల పెట్టిన హరిత హారం మొక్కలు నేడు ఏపుగా ఎదిగి ఆకట్టు కుంటున్నాయి. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారాన్ని నిర్వహించి, అన్ని గ్రామాల్లో మొక్కలు నాటించారు. మాజీ సర్పంచ్ సుజాత ప్రత్యేక శ్రద్ధ వహించి, రోడ్డుకు ఇరువైపులు మర్రి, రావి, వేప తదితర మొక్కలను నాటి సంరక్షించారు.

ఆర్థిక అభివృద్ధి చెందాలి



ఫ్రిజ్, కుట్టుమిషిన్లు అందిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబాలకు అందిస్తున్న చేయూతతో ఆర్థిక అభివృద్ధి సాధించాలని ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నారు. గూడూర్‌లోని శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలువురు పేద కుటుంబాలకు వ్యాపారాల నిమిత్తం ఫ్రిజ్, కుట్టుమిషిన్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలాన్ని వృథా చేయకుండా నచ్చిన వ్యాపార రంగాల్లో రాణిస్తూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. చేడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ భక్తిమార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురుపీఠం సభ్యులు సూర్యకుమార్‌గౌడ్, లిఖిత, చిన్నారెడ్డి, హన్మంతు సత్యనారాయణగౌడ్, కొండల్, నాగరాజు, భాస్కర్, తదితరులు ఉన్నారు.

అంజన్నకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం, మాన్యసూక్తపారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీశర్మ, శ్రీవాత్సవ్‌శర్మ తదితరులు ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఈఓ రాధాకిషన్

హవేళిఘణాపూర్(మెదక్): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించి మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. మెదక్ మండలంలోని మాచవరం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం రాయిన్‌పల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు రైతులకు బోరుబావులకు సరిగ్గా కరెంట్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం రాయిన్‌పల్లిలో లోవోల్టేజీ కరెంట్ సమస్యతో బోర్లు నడువడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన మాట్లాడుతూ.. బోరుబావులకు నిరంతరం లోవోల్టేజీ సమస్య లేకుండా కరెంట్ సరఫరా చేయాలని అధికారులను కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ సిద్ధాగౌడ్, నర్సింగ్‌రావు, నవీన్, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

శిథిలావస్థలో పాఠశాలలు

- నిరుపయోగంగా గౌతాపూర్ నూతన ఉన్నత పాఠశాల
- నిర్లక్ష్యంగా అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు



అంతారంలో పూర్తిగా పైకప్పు పెచ్చులు ఊడి, చువ్వలు తేలిన గది

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ భవనాలు, విద్య అందుబాటులోకి వచ్చినా పలు గ్రామాల్లో పాఠశాలలు ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్నా.. పట్టించుకునే వారు లేరు. దీంతో గ్రామాల్లో విద్యను అభ్యసించే నిరుపేద విద్యార్థులు తప్పని పరిస్థితుల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలనే ఆశ్రయిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల నిరుపయోగంగానే ఉంది. పలు గ్రామాల్లో పాఠశాల భవనాల నిర్మాణాలు ప్రారంభించి, శ్లాబ్ దశలోనే వదిలేశారు. చిలప్‌చెడ్ మండలం అంతారం, జగ్గంపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలు శిథిలావస్థకు చేరుకొని ఏళ్లు గడుస్తున్నాయి. అంతారం గ్రామ పాఠశాలలో ఓ తరగతి గదిలో పైకప్పు పూర్తిగా పెచ్చులు ఊడిపోయింది. పాఠశాలలో ఉన్న 58 మంది విద్యార్థులు మిగతా రెండు గదుల్లోనే విద్యను అభ్యసిస్తున్నారు. ఆ రెండు గదుల్లో సైతం వర్షం వస్తే ఇబ్బందులే. జగ్గంపేట గ్రామ పాఠశాల పైకప్పు కూలినప్పుడు అదృష్టవశాత్తు ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అని పాఠాలు బోధించేందుకు సైతం ఉపాధ్యాయులు జంకుతున్నారు.



గౌతాపూర్ పూర్తయిన నూతన పాఠశాల

ఇబ్బందుల్లో విద్యార్థులు



సోమక్కపేట్ గ్రామంలో పాఠశాల నిర్మాణం ప్రారంభమై ఏళ్లు గడుస్తుంది. అయినప్పటికీ, పాఠశాల నిర్మాణం శ్లాబ్ దశలోనే ఉంది. లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేయకుండా, మధ్యలోనే నిర్మాణాలు ఆపేయడం ఎంతవరకు సమంజసం. గ్రామంలో ఒకే ప్రహరీలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీకాంత్‌గౌడ్, సోమక్కపేట్

ఉన్నతాధికారులకు విన్నవిస్తా



మండలంలోని అంతారం, జగ్గంపేట గ్రామాల్లో ఉన్న శిథిలావస్థ పాఠశాలల విషయం తమ దృష్టికి రాలేదని, వెంటనే ఆ పాఠశాలలను పరిశీలించి, ఆ పాఠశాలల భవనాలకు మరమ్మతులు జరిగేలా చర్యలు తీసుకుంటాం. వాటి స్థితిగతుల గురించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తా.

– విఠల్, మండల విద్యాధికారి, చిలప్‌చెడ్

మరోవైపు గౌతాపూర్ గ్రామ శివారులో సుమారు రూ. 35 లక్షలతో పాఠశాల నిర్మాణం పూర్తయి ఏళ్లు గడిచినా, దానిని వినియోగించేవారు దిక్కులేక.. ఆ భవనం పాడైపోయింది. దీంతో అధికారులు దానిని పరిశీలించి, మన ఊరు– మనబడి, పథకంలో నిధులు మంజూరు చేయడంతో 2023 నుంచి పాఠశాల మరమ్మతులు చేయడంతో ప్రస్తుతం ఆ భవనం కార్పొరేట్ పాఠశాలను తలపిస్తుంది. సుమారు రూ. కోటి నిధులతో ఆ పాఠశాల భవనంలో తాగునీరు, డైనింగ్ హాల్, విద్యుత్, మరుగుదొడ్లు, వంటగది, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి. అయినప్పటికీ పాఠశాల భవన నిరుపయోగంగానే ఉంది. మరో మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలో ఉన్నత పాఠశాల నిర్మాణం 2016లో, గంగారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల నిర్మాణం 2018లో ప్రారంభమయ్యాయి, ఇప్పటికీ ఆ నిర్మాణాలు శ్లాబ్ దశలోనే ఉన్నాయి. వాటిని పట్టించుకున్న వారు లేరు.

3 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

నిజాంపేట(మెదక్): భక్తులకు కోరిన కోరికలు తీర్చే స్వయంభువుగా తిరుమలస్వామి అవతరించాడు. రథసప్తమిని పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతాయి. ప్రశాంత వాతావరణంలో కొలువైన స్వామివారు పశ్చిమాభిముఖంగా కొలువుదీరారు. ఉత్తర ద్వారం గుండా లోనికి వెళ్లేటప్పుడు కుడివైపు క్షేత్రపాలకుడిగా భైరవుడు దర్శనమిస్తారు. ఎడమ వైపు నవ విగ్రహాలు, గరుడ హన్మాండ్లు కొలువై ఉన్నారు. గడప వద్ద స్వామి వారి పాదముద్రలు ఉంటాయి. ఆలయ అర్చకుడు నిత్యం ఆలయంలోనే అందుబాటులో ఉంటారు. కాకతీయులు కాలంలో దీన్ని తిమ్మయ్య శెట్టి నిర్మించినట్లు స్థల పురాణం చెబుతుంది. రథసప్తమి రోజున కల్యాణం కనువిందుగా జరుగుతుంది.

3 నుంచి 6 వరకు ఉత్సవాలు

3 నుంచి ప్రారంభమైయ్యే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం శాంతి పాఠం, రక్షబంధనం, పుణ్యావాచనం, అంకురార్పణం, అరగింపు, తీర్థ ప్రసాద గోష్టి, మంగళవారం ధ్వజారోహణం, దేవతాహ్వాణం, మూలమూర్తుల అభిషేకం, అలంకారం, నైవేద్యం, కల్యాణం, హోమం, బండ్ల ఊరేగింపు, బుధవారం బాలబోగం, నిత్యాహోమం, అభిషేకం, అలంకారం, గరుడోత్సవం, నైవేద్యం, హారతి, తీర్థప్రాసాద గోష్టి, ఆరాధన, నిత్యహోమం, రథోత్సవం, ఆరగింపు, హారతి, తీర్థప్రసాదగోష్టి, గురువారం నిత్యాహోమం, పూర్ణహుతి, శతఘటాభిషేకం చక్రతీర్థ, నైవేద్యం, హారతి, తీర్థప్రసాద గోష్టి, ద్వాదశరాధన, ఏకాంతసేవ, పండిత సన్మానం, సమాప్తి జరుగుతుంది.

బడ్జెట్‌పై సీఐటీయూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నర్సాపూర్: కేంద్ర మంత్రి నిర్మల సీతరామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశ అభివృద్ధిని బలహీనపరిచేలా ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, నాగరాజు ఆరోపించారు. శనివారం వారు పలువురు నాయకులతో కలిసి చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులపై సబ్సిడీలో భారీగా కోత పెట్టారని విమర్శించారు. వారి వెంట పలువురు నాయకులు గోపాల్, రవి, నగేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్



నర్సాపూర్ రూరల్: విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ అందిస్తున్న నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి

నర్సాపూర్ రూరల్: క్రీడలతో మానసికోల్లాసమని నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కిరణ్ అన్నారు. శనివారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, బ్యాట్మింటన్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఆయా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వాలీబాల్, బ్యాట్మింటన్, చెస్ కిట్లను అందజేయడంతో పాటు ట్రోఫీలు, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్, రాజు, మహేందర్‌రెడ్డి, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



కొల్చారం(నర్సాపూర్): ఇరుజట్లకు బహుమతులు అందిస్తున్న సంతోష్‌రావు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్ గ్రామంలో జరిగిన గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో విక్టరీ వారియర్స్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకుంది. మండల బీఆర్‌ఎస్ యువత నాయకుడు సంతోష్‌రావు సౌజన్యంతో ఈ క్రికెట్ పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్ విక్టరీ వారియర్స్, కేపీఆర్ కింగ్స్ మధ్య జరిగింది. విజేతకు రూ.15 వేల నగదు, రన్నర్ ఆఫ్ జట్టుకు రూ.10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రవీణ్, ఉపాధ్యాయులు యాదయ్య, వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, పీఆర్టీ సత్యనారాయణరెడ్డి, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.



అల్లాదుర్గం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న ఎంఈఓ ధనుంజయ

అల్లాదుర్గం(మెదక్): వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులకు రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఇంటికి వెళ్లే ముందు విద్యార్థులకు ఆకలి వేస్తుండటంతో ప్రభుత్వం సాయంత్రం స్నాక్స్ అందజేస్తుందని ఎంఈఓ ధనుంజయ్య చెప్పారు. అల్లాదుర్గం జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ వెంకటేశం అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. అనంతరం వారికి అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధిరాములు, ఎమ్మార్సీ సిబ్బంది సంపత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో ..



విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న ఎంఈఓ

చిన్నశంకరంపేట(మెదక్): ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అందించే అల్పహారం కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో హెచ్‌ఎం దీప్లారాథోడ్ ప్రారంభించారు. ఈ రోజు నుంచి 40 రోజుల పాటు 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం 5:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోజుకు ఒక ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తూ విద్యార్థులకు పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేయనున్నట్లు వివరించారు.

నీరు విడుదలపై హర్షం

వెల్దుర్తి(తూప్రాన్): కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీవాగులోకి సాగునీరు విడుదల చేయడంపై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హల్దీవాగులోకి నీటి విడుదలతో పరిసర ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని నీటి విడుదలకు కృషి చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, ఈఎన్‌సీ హరిరామ్‌కు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

నీటి సమస్య రాకుండా చర్యలు

ఎంపీఓ కలీముల్ల

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో వచ్చే వేసవి సందర్భంగా నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీఓ కలీముల్ల తెలిపారు. శనివారం మండలంలోని ధర్మాసాగర్, కంచన్‌పల్లి, సదాశివపల్లి గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి వసతిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ ట్యాంక్, నీటి సౌకర్యం, నల్ల కనెక్షన్లు, లీకేజీలు, ఇతర బోర్ సదుపాయాలపై ఆరా తీశారు. ప్రస్తుతం సమస్యలు తెలుసుకొని జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరహరి, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకులు, బోరుబావుల పరిశీలన



కౌడిపల్లి ధర్మాసాగర్‌లో మంచినీటి ట్యాంక్ వద్ద నీటి వసతిని పరిశీలిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రానున్న వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ అన్నారు. వేసవిలో తాగునీటి సరఫరా గురించి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం మండలంలోని శభాష్‌పల్లి, దొంతి గ్రామాల్లో పర్యటించి గ్రామ రక్షితవాటర్ ట్యాంకులు, బోరుబావులు, పైప్‌లైన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 రోజులు పాటు నీటి సరఫరా గురించి చేపట్టాల్సిన అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బోరుబావులు, పైప్‌లైన్‌కు సంబంధించి ఎద్దైన ఇబ్బందులుంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో గ్రామాల ప్రత్యేక అధికారి తిరుపతిరెడ్డి, ఏఈ పుష్పేంద్ర శకావత్, పంచాయతీ కార్యదర్శులు వీణకుమారి, శేఖర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

మార్కండేయస్వామికి పూజలు

పెద్దశంకరంపేట(మెదక్): మార్కండేయ మహర్షి జయంతిని పురస్కరించుకొని మందిరంలో సామూహిక కుంకుమార్చనలను వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారికి మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు కనకరాజు, అనిల్, జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షుడు మహంకాళి కృష్ణమూర్తి, మల్లేశం, లింగం, సుధీర్, నారాయణ, రాములు తదితరులున్నారు.



నర్సాపూర్‌లో మార్కండేయ స్వామికి పూజలు చేస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు నర్సింలు ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేసి, మార్కండేయస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కండేయ స్వామికి పద్మశాలి సంఘం సభ్యులు, సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు తిరుమలేష్, డాక్టర్ పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంతో పాటు కాళ్లకల్‌లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని నిర్వహించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో అనంతపద్మానాభస్వామి గుట్ట వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్ పద్మశాలీల ఆధ్వర్యంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నందాల గణపతి, రెడ్డి కృష్ణ, ఓంకార్, అశోక్, యేసు, నవీన్, వెంకటేశం, ఉత్తంకుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చన

శివాలయంలో..

నర్సాపూర్: పట్టణంలోని శివాలయంలో మార్కండేయ చిత్రపటానికి పద్మశాలీ సంఘం సభ్యులు ప్రభాకర్‌రావు, చెన్నకృష్ణ, వినోద్, నర్సింగ్‌రావు, ప్రకాష్ తదితరులు పూజలు చేశారు.

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో పద్మశాలీలు చేనేత సహకార సంఘం ఆవరణలో మార్కండేయస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి దర్గా ఉత్సవాలు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని షాహెదల్లా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అహ్మద్ నూరుల్లా హుసేని హుసేని ఖాద్రి ఆధ్వర్యంలో హజరత్ షాహిద్ దర్గా ఉర్సు ఉత్సవాలు విజయవంతం చేయాలని మెదక్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్ షేక్ మజహర్ శనివారం కోరారు. ఈనెల 2 నుంచి 4 వరకు ఉర్సు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు.

కొనసాగుతున్న బీరప్ప ఉత్సవాలు



గంగ బోనం ఊరేగింపు



బావిలో నుంచి విగ్రహాలను తీస్తున్న వీరగంధాలు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్పస్వామి జాతర మహోత్సవ ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంగ బోనాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. గొల్లకురుమలు గ్రామ శివారులోని బావిలో దాచిపెట్టిన బీరప్పస్వామి రాతి ప్రతిమలను బావిలో నుంచి వెలికి తీశారు. అనంతరం విగ్రహాలను ఊరేగించి, బీరప్ప స్వామి దేవాలయం వద్ద ప్రత్యేక పూజ నిర్వహించి బోనాన్ని సమర్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ **పేదలకు మేలు చేసే బడ్జెట్**

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్ పేదలకు మేలు చేసేలా ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రమణరావులు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతరామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దేశ అభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అందుకు అనుగుణంగా బడ్జెట్ ఉందని చెప్పారు.

◆ **ఆలయ వార్షికోత్సవాలు**

తూప్రాన్: పట్టణంలోని బాలాంజనేయస్వామి ఆలయం 30వ వార్షికోత్సవం శనివారం దేవి ఉపాసకుడు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం, పూజలు, పరివార దేవతలకు అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

◆ **కుక్కల దాడిలో గొర్రెలు మృతి**



చిలప్‌చెడ్(నర్సాపూర్): వీధి కుక్కల దాడిలో ఎనిమిది గొర్రెలు మృతి చెందాయి. మరో 10 గొర్రెలు గాయపడిన సంఘటన మండలంలోని సోమక్కపేటలో శనివారం చోటు చేసుకుంది. గొర్రెల యజమాని శేరి అర్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతీ నిత్యం జీవాలను మేపుకొని వచ్చాక, వాటిని చుట్టూ కంచె వేసి ఉన్న పాకలో ఉంచుతామన్నారు. ఉదయం పాక దగ్గరికి వెళ్లి చూడగా, ఎనిమిది గొర్రెలు మృతి చెందడంతో పాటు మరో పది గొర్రెలపై కుక్కలు దాడి చేసిన ఆనవాళ్లు ఉన్నాయన్నారు. గాయపడ్డ వాటిలో మరిన్ని గొర్రెలు మృతి చెందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు.

◆ **5న జాబ్‌మేళా**

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ పిలుపునిచ్చారు. శనివారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో ఈనెల 5న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. సదాశివపేటకు చెందిన ఎవరెస్టు ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థలో ట్రైనీ ఉద్యోగాల కోసం ఖాళీలున్నాయని, మరిన్ని వివరాలకు 93815 57831 నంబరులో సంప్రదించాలని కోరారు.